సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 2 । జూన్ । 2024



అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి 8లో



పిళ్లా కేసమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న ఆరిలోవ 7వ నంబరు సచివాలయ అడ్మిన్ సురేష్



షూటింగ్ సందడి

కొమ్మాది: మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంతాల్లో శనివారం మనోజ్ హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్ సందడి నెలకుంది.

న్యూస్‌రీల్

శ్రీ శారదాపీఠంలో ఘనంగా హనుమత్ జయంతి



హనుమ యాగాన్ని పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

పెందుర్తి: విశాఖ శ్రీశారదాపీఠంలో హనుమత్ జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా పీఠంలోని 16 అడుగుల దాసాంజనేయస్వామికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. శత్రు బాధ, గ్రహ బాధ, నివృత్తికి మన్యుసూక్త సహిత హనుమత్ హోమం నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

విశాఖ విద్య: సార్వత్రిక విద్య విధానంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. టెన్త్ పరీక్షకు జిల్లాలో 3 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 286 మంది పరీక్షకు హాజరయ్యారు. అదే విధంగా జిల్లాలోని ఐదు కేంద్రాల్లో జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షకు 360 మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న జేసీపీ ఫకీరప్ప

విశాఖ సిటీ: డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ సీపీ ఫకీరప్ప పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి 17 మంది ఫిర్యాదుదారులు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అలాగే వృద్ధుల కోసం మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఏడుగురు ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. వాటిపై జేసీపీ వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని చెప్పారు.

మామిడి పండ్ల సంతకు స్పందన



మామిడి పండ్లను విక్రయిస్తున్న స్థానికులు

ఎంవీపీకాలనీ: సహజ సిద్ధంగా పండించిన మామిడి పండ్లను విక్రయించేందుకు ఎంవీపీ కాలనీలో ప్రత్యేక సంతను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీకాలనీలోని గిరిజన భవన్ వేదికగా ఈ సంత జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు సంతకు తరలివచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేశారు. విశాఖ గ్రామీణ ప్రాంతాలతో పాటు పలు చోట్ల ప్రకృతి వ్యవసాయం ద్వారా మామిడి పండ్లను పండించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రతినిధి పీఎల్ఎన్ రాజు తెలిపారు. మరికొన్ని రోజులు విక్రయాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏయూ ఈఈటీ సీట్లు కేటాయింపు పూర్తి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు తొలి దశ కౌన్సెలింగ్ పూర్తిచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసి, శనివారం సీట్లు కేటాయించారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా నిర్ణీత ఫీజును చెల్లించాలి. ఈ సంవత్సరం ప్రవేశాలకు భారీగా డిమాండ్ పెరిగింది. మొదటి వెయ్యి ర్యాంకులలోనే అధికశాతం మంది ప్రవేశాలకు దరఖాస్తు చేయడం, సీట్లు సాధించడం కనిపించింది.

మళ్లీ 'టోల్' బాదుడు

- ప్రస్తుత చార్జీలపై 5 శాతం పెంపు
- నేటి అర్ధరాత్రి నుంచి అమల్లోకి..
- ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నుంచి నిలిచిన చార్జీల పెంపు
- తుది దశ పోలింగ్ ముగియడంతో వడ్డనకు శ్రీకారం



అగనంపూడి టోల్ ప్లాజా

సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే వాహన యజమానులకు భారంగా మారిన టోల్‌గేట్ చార్జీలు మరింత భారం కానున్నాయి. ప్రస్తుత చార్జీలకు ఐదు శాతం అదనంగా పెరగనున్నాయి. ఇవి ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి రానున్నాయి. టోల్‌గేట్‌ల ఫీజును వసూలు కాంట్రాక్టును దక్కించుకున్న వ్యక్తి/సంస్థ ఏటా టోల్‌గేట్ రేట్లను పెంచుకోవడానికి అనుమతిస్తారు. ఇందుకు సంబంధిత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచిన టోల్ ఫీజును వసూలు చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అన్ని దశలు ముగిసే వరకు పెంపు అమలును నిలిపి వేశారు. జూన్ ఒకటో తేదీతో తుది దశ పోలింగ్ పూర్తయింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి (జూన్ 2వ తేదీ) నుంచి పెంచిన టోల్ ఫీజు చార్జీలను వసూలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా టోల్ ప్లాజాల నిర్వాహకులకు ఎన్‌హెచ్ఏఐ అధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. నిబంధనల ప్రకారం ప్రస్తుత చార్జీలపై ఐదు శాతం టోల్ ఫీజును పెంచారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అగనంపూడి, వేంపాడు టోల్ ప్లాజాలున్నాయి. వీటిలో అగనంపూడి టోల్ ప్లాజాలో మాత్రం కార్లు, జీపులు, వ్యాన్లకు టోల్ ఫీజులు పెరగలేదు. అక్కడ ఈ వాహనాలకు ఒక వైపు రూ.65, రానుపోను రూ.95 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇకపై కూడా వీటికి ఇవే చార్జీలు వసూలు చేయనున్నారు. ఇది ఈ టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగించే కార్లు, జీపులు, వ్యాన్లకు కాస్త ఊరటనివ్వనుంది. మిగిలిన వాహనాలకు కనీసం రూ.5 నుంచి రూ15 వరకు పెంచారు. అలాగే వేంపాడు టోల్ ప్లాజాలో కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వాహనాల (ఎల్ఎంవీ)కు ప్రస్తుతం ఒక వైపు రూ.135 వసూలు చేస్తుండగా ఇకపై రూ.140, రానుపోను రూ.200 నుంచి రూ.210కి పెంపుదల చేశారు. ఇంకా మిగిలిన వాహనాలపై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచారు. పెరిగిన టోల్ ఫీజులను శనివారం నుంచే ఆయా ప్లాజాల్లో బోర్డుల్లో ప్రదర్శనకు ఉంచారు.

వేంపాడు టోల్ ప్లాజాలో ఇలా

(బ్రాకెట్లలో పాత చార్జీలు రూ.లలో)

వాహనం వివరం	సింగిల్	రానుపోను
కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికల్	రూ.140 (135)	రూ.210 (200)
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికల్/మినీ బస్సు	రూ.225 (220)	రూ.335 (325)
బస్సు/ట్రక్కు	రూ.470 (455)	7రూ.00 (685)
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.510 (500)	రూ.765 (745)
భారీ వాహనం (7+ యాక్సిల్స్)	రూ.895 (870)	రూ.1340 (1310)

అగనంపూడి టోల్ ప్లాజాలో ఇలా..

వాహనం వివరం	సింగిల్	రానుపోను
కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వెహికల్	రూ.65 (65)	రూ.95 (95)
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికల్/మినీ బస్సు	రూ.105 (100)	రూ.155 (155)
బస్సు/ట్రక్కు	రూ.220 (215)	రూ.330 (320)
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.240 (235)	రూ.360 (350)
భారీ వాహనం (7+ యాక్సిల్)	రూ.420(410)	రూ.625 (610)

అల'జడి వాన'

- మెరుపులు, పిడుగులు, ఈదురుగాలులు
- పలుచోట్ల నేల కూలిన చెట్లు
- గాజువాకలో 6 సెం.మీల వర్షపాతం నమోదు



మెరుపులతో అలజడి

సాక్షి, విశాఖపట్నం: శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు కురిసిన వాన అలజడి రేపింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వాటికి పిడుగులు, ఈదురుగాలులు కూడా తోడయ్యాయి. ఫెళఫెళమంటూ శబ్దాలు చేస్తూ పిడుగులు ఒకపక్క, కుండపోత వర్షం మరోపక్క వెరసి ఉమ్మడి విశాఖ జిల్లాను తడిసి ముద్ద చేశాయి. పిడుగుల శబ్దాలకు నిద్రలో ఉన్న వారు ఉలికిపాటుకు గురయ్యారు. మరోవైపు ఈదురుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. కొన్నిచోట్ల రోడ్లపై చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెనువెంటనే వీటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షం కొనసాగింది. ఉదయం తర్వాత విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ వాన అక్కడక్కడ కురిసింది. ఇలా శనివారం ఉదయం 8.30 గంటల వరకు అనకాపల్లి జిల్లా కె.కోటపాడులో 7.5 సెం.మీల భారీ వర్షపాతం నమోదైంది. ఇంకా గాజువాకలో 6 సెం.మీలు, కాపులుప్పాడలో 5.8, పరవాడలో 5.4, ఎస్.రాయవరంలో 5.2, గోపాలపట్నంలో 5, సింహాచలంలో 4.3, పెందుర్తిలో 4.2, నర్సీపట్నంలో 3.3 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. కాగా రానున్న మూడు రోజులు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పడతాయని పేర్కొంది.



వుడా పార్కులో ఈదురు గాలులకు కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

రవాణా కార్యాలయంలోనే డీఎల్ పొందాలి

గోపాలపట్నం: రవాణా కార్యాలయంలోనే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని.. డ్రైవింగ్ స్కూళ్లలో ఆ సదుపాయం లేదని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జూన్ 1 నుంచి డ్రైవింగ్ స్కూళ్లలో డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చని, రవాణా కార్యాలయాలకు వెళ్లే పనిలేదని వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లకు స్లాట్లు బుక్ చేసుకుని.. రవాణా శాఖ కార్యాలయాల్లో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. మోటార్ వాహన చట్టం సెక్షన్–12ను అనుసరించి డ్రైవింగ్ స్కూళ్లకు కూడా ప్రభుత్వ గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. అక్రిడేటెడ్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ (ఏడీటీసీ) గుర్తింపు పొందడానికి కనీసం ఎకరా స్థలం(టూ వీలర్, త్రీ వీలర్, లైట్ మోటార్ వాహనాలు) ఉండాలని, మీడియం, భారీ వాహనాలకు కనీసం రెండు ఎకరాల స్థలం ఉంటేనే ఆయా సంస్థలకు గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. వీటితో పాటు రెండు తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రాజెక్ట్ సిస్టమ్, బ్రాడ్ బ్యాండ్ సదుపాయం, డ్రైవింగ్ ట్రాక్‌లు, డ్యూయల్ కంట్రోల్‌తో ఓ వాహనం తదితర మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. వర్క్‌షాప్‌లో వాహనం విడి భాగాలు ప్రదర్శించాలని సూచించారు. తర్ఫీదు పొందిన బోధకులు, తగిన స్టాఫ్, వాహనాలకు బీమా సౌకర్యం ఉండాలన్నారు. ఈ నిబంధనలు పాటించిన సంస్థలకు గుర్తింపునిస్తామని స్పష్టం చేశారు. 2021 జూలై ఒకటో తేదీన కేంద్రం ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇంతర వరకు రాష్ట్రంలో ఒక్క దరఖాస్తు అందలేదని, సారథి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే అన్ని పరిశీలించి గుర్తింపు మంజూరుచేస్తామని వివరించారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్

- రేపటి నుంచి అమల్లోకి 144 సెక్షన్
- కౌంటింగ్ కోసం 997 మంది సిబ్బంది
- 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభం
- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఏడు కౌంటింగ్ కేంద్రాలు
- 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి
- సీపీతో కలిసి వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ మల్లికార్జున
- ఏజెంట్లకు ఆల్కహాల్ పరీక్ష : పోలీస్ కమిషనర్ రవిశంకర్

సాక్షి, విశాఖపట్నం : ఓట్ల లెక్కింపునకు జిల్లాలో దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో 7 కౌంటింగ్ కేంద్రాల్లో 4న ఉదయం 8 గంటలకే ప్రక్రియ ప్రారంభమవుతోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది ఉదయం ఆరు గంటలకే కేంద్రాలకు చేరుకోవాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని, విధుల్లో భాగస్వామ్యమయ్యే వారికి తొలి విడత శిక్షణ కూడా పూర్తి చేశామన్నారు. 3వ తేదీన మరోసారి శిక్షణ అందిస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ డా.ఎ. రవిశంకర్‌తో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై శనివారం మాట్లాడారు. కలెక్టర్ ఏమన్నారంటే..

ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం

ఉదయం ఎనిమిదికే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఆ రోజు కౌంటింగ్ సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకు, ఏజెంట్లు ఉదయం 7 గంటలకల్లా తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది. అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు ప్రారంభం అవుతుంది. అన్నిచోట్లా అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు

పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఏయూ పరిధిలో ఏడు హాళ్లు గుర్తించాం. నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశాం. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఒక్కో టేబుల్‌కు గాను ఒక్కో కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంటు, ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ని నియమించాం. పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నాం. ఇందుకు గాను రెండు హాళ్లను గుర్తించాం. 18 టేబుళ్లను కేటాయించాం. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరొక 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించాం.

15 రౌండ్లలో లెక్కింపు పూర్తి

జిల్లాలోని అసెంబ్లీలకు వచ్చేసరికి పార్లమెంటుతో కలిపే అన్ని ఏర్పాట్లు చేశాం. అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరొక మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయి. అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు గాను ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశాం. 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. 24 మంది అదనపు ఏఆర్వోలు, 33 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 57 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 33 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించాం. ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 997 మందిని కౌంటింగ్ కోసం కేటాయించాం. ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్దా ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ (గెజిటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక కౌంటింగ్ స్టాఫ్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. పోస్టల్ బాలెట్ కౌంటింగ్ కోసం ప్రతీ టేబుల్ వద్దా ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్ (గెజిటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గెజిటెడ్) , ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఈటీపీబీఎస్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక ఏఆర్వో ఉంటారు.

140 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లుగా నియామక పత్రం ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తాం. ఒక అధికారిక వీడియోగ్రాఫర్ ద్వారా మొత్తం కౌంటింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తాం. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఓటర్లు ఎవరికి ఓటు వేశారన్న రహస్యానికి భంగం వాటిళ్లకుండా లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తాం. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లిరావడానికి సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరుగా మార్గాలను ఏర్పాటు చేశాం.

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు

కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. మొబైల్ ఫోన్లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు తదితర ఏ విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోం. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 18సి ఫారం, తెల్లకాగితం మాత్రమే తమతో పాటు తీసుకొని రావాలి. పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున కౌంటింగ్ కేంద్రాలకు హాజరయ్యే ఏజెంట్లు కౌంటింగ్ రోజు ఉదయం 6గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. వారు అల్పాహారం, భోజనం తగిన మొత్తం చెల్లించి అక్కడ ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో పొందే సౌకర్యం కల్పించాం. ఏజెంట్లకు తాగునీరు, టీ అందిస్తామని చెప్పారు.

6 వరకు ఎన్నికల కోడ్

రేపటి నుంచి మద్యం షాపుల బంద్

జిల్లాలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అందరూ శాంతియుతంగా ఉండి కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. జూన్ 6వ తేదీ వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. అప్పటివరకు ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు. 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసి వేస్తున్నాం. ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. లేదంటే ఆర్వోల ద్వారా వారిపై చర్య తీసుకుంటాం. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, కౌంటింగ్ ప్రక్రియ కూడా సజావుగా, శాంతియుతంగా పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి.

సీపీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉందని నగర పోలీస్ కమిషనర్‌డా.రవిశంకర్ పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా ఉంటుంది. ఇతరులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగర వేయకుండా, లెక్కింపు కేంద్రాలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించాం. 2 కిలోమీటర్ల పరిధి వరకు రెడ్ జోన్ ఉంటుంది. లెక్కింపు రోజున డ్రై డేగా ప్రకటిస్తున్నాం. ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యాక కూడా ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదు. జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసి వేస్తున్నాం. అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లుగా వచ్చే వారికి ఆల్కహాల్ పరీక్ష నిర్వహిస్తాం. బ్రీత్ ఎనలైజర్లను అందుబాటులో ఉంచుతాం. వాహనాల పార్కింగ్ కోసం లెక్కింపు కేంద్రాలవద్ద కౌంటింగ్ అధికారులకు, ఏజెంట్లకు వేర్వేరుగా పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేశాం. సోషల్ మీడియా ద్వారా ఇతరులను కించపరిచేలా గానీ, రెచ్చగొట్టే విధంగా గానీ ఎలాంటి పోస్టుల చేయకూడదు. కేంద్రాల పరిధిలోకి వచ్చే వారు విధుల నిర్వహణకు తప్పకుండా ఐడీ కార్డులు ధరించాలి.

కళాశాల.. కళకళ

- తెరుచుకున్న జూనియర్ కాలేజీలు
- ప్రారంభమైన ఇంటర్ తరగతులు
- టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణతతో కోర్సులకు డిమాండ్
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల జోరు
- తొలి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 366 జూనియర్ కాలేజీలు
- గతేడాది 58,944 మంది విద్యార్థులు చేరిక
- వార్షిక విద్యా క్యాలెండర్ ఖరారు

విశాఖ విద్య: చదువుల కాలం మళ్లీ మొదలైంది. 2024–25 విద్యా సంవత్సరం వార్షిక క్యాలెండర్ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు శనివారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. తొలిరోజు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల, తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించారు. ఏడాది చదువులు సవ్యంగా సాగేలా విద్యార్థులతో పాటు, తల్లిదండ్రుల పాత్రను ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్ వారికి వివరించారు. సప్లిమెంటరీ పరీక్షలు ముగియడంతో సోమవారం నుంచి అన్ని జూనియర్ కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన సైతం ప్రారంభించేందుకు కాలేజీల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్మీడియెట్ చదువుల ప్రాధాన్యత దృష్ట్యా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ప్రభుత్వం ఈసారి ముందుగానే ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగేలా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 39 ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ -11, ట్రైబర్ వెల్ఫేర్ -10, కేజీబీవీ -34, బీసీ వెల్ఫేర్ -2 మోడల్ జూనియర్ కాలేజీలు -5, హైస్కూల్ ప్లస్ -16 , ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 246 కాలేజీలు ఉన్నాయి. ఎయిడెడ్, ఇన్సెంటివ్, కార్పోరేట్ యాజమాన్యాల పరిధిలో ఒక్కో కాలేజీ ఉన్నాయి. వీటి పరిధిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఫస్టియర్‌లో మూడు జిల్లాల్లో 58,944 మంది ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరారు. టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణత రావడంతో ఈ ఏడాది అడ్మిషన్లు 60 వేలకు పైగానే ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

పక్కాగా విద్యా క్యాలెండర్

2024–25 విద్యా సంవత్సరంలో 222 రోజులు కాలేజీలు పనిచేసేలా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన మొదలుపెట్టారు. జులై 29 నుంచి 31 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 29 నుంచి 31 వరకు సెకెండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ సెప్టెంబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు.

దసరా సెలవులు అక్టోబర్ 3 నుంచి 11 వరకు ఉంటాయి.మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 23 వరకు జరుగనున్నాయి. నాల్గో యూనిట్ పరీక్షలు నవంబర్ 21 నుంచి 23 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలు డిసెంబర్ 16 నుంచి 231వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2025 జనవరి 13 నుంచి 18 వరకు ఇస్తారు. ప్రీ ఫైనల్ ఫిబ్రవరి 3 నుంచి 10 వరకు, వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా క్యాలెండర్‌ను ప్రకటించారు.



ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ

అమ్మఒడితో ఉన్నత చదువులవైపు..

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ. 15 వేలు అందుతుండటంతో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువుల వైపు వస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాడు–నేడు పథకం ద్వారా మౌలిక సౌకర్యాలు పెంపొందడంతో ఈ ఏడాది అడ్మిషన్లు పెరుగుతాయని కాలేజీల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. మరో పక్క ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులు సైతం ఫలితాల తరువాత ఇంటర్మీడియెట్‌లో చేరనున్నారు. ఈ మొత్తం పరిణామాల్లో జూనియర్ కాలేజీలో విద్యార్థుల సందడి మొదలైంది.

అడ్మిషన్లు పెంపునకు ప్రత్యేక దృష్టి



2024–25 విద్యా క్యాలెండర్ ప్రకారం శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. స్పాట్ వ్యాల్యూషన్ కూడా సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. భవిష్యత్ చదువులకు ఇంటర్మీడియెట్ తొలి మెట్టు అయినందున, నాణ్యమైన విద్య అందించేలా కాలేజీలపై పర్యవేక్షణ పెంచుతాం.

– మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

3న విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా కొన్ని రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

రద్దు చేసిన రైళ్లు

ఆదివారం కొయంబత్తూర్-సిల్చార్(12515) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జూన్ 3న పలాస-విశాఖపట్నం-పలాస(07471/07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, 4న బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

పూరి-గుణుపూర్ (18417) గంట ఆలస్యంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు, విశాఖపట్నం-కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.45 గంటలకు, యశ్వంత్‌పూర్-పూరి (22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 2.20 గంటలు ఆలస్యంగా మధ్య రాత్రి ఒంటి గంటకు, హౌరా-ఎర్నాకుళం (22877) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు, షాలిమర్ -చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా సాయంత్రం 4.25 గంటలకు బయలుదేరింది.

- జూన్ 2న రాత్రి 11.40 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్-సంత్రగచ్చి (07234) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా 3వ తేదీ తెల్లవారు 3.10 గంటలకు బయలుదేరుతుంది.
- జూన్ 3వ తేదీ తెల్లవారు 4.30 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్-షాలిమర్ (07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా తెల్లవారు 5.30 గంటలకు బయలుదేరుతుంది.

జైలుకు వైద్య సామగ్రి వితరణ

రూ.10.5 లక్షలతో అందించిన సింబయాసిస్, విజ్ఞాన్, జెన్ క్యూబ్ సంస్థలు



ఎనీ టైం క్లినిక్ వద్ద జైలు శాఖ ఐజీ శ్రీనివాసరావు, దాతలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగానికి విశాఖకు చెందిన సింబయాసిస్, విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌కు చెందిన జెన్‌క్యూబ్ టెక్నాలజీ సంస్థలు వైద్య పరికరాలను అందజేశాయి. ఆ సంస్థల ప్రతినిధులు శనివారం కారాగారాన్ని సందర్శించారు. సీఎస్సార్‌లో భాగంగా రూ 10.50 లక్షల విలువైన వైద్య సామగ్రిని జైలు శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు, జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్‌కు అందజేశారు. ఈ పరికరాలను జైలు ఆస్పత్రిలో అమర్చనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఈ పరికరాల ద్వారా ఆధునిక పద్ధతిలో మూడు నిమిషాల్లో 73 వైద్య పరీక్షలు చేయవచ్చన్నారు. ఈ పరికరాలు అందుబాటులోకి వస్తే దేశంలోనే ఇలాంటి వైద్య పరీక్షలు అందించే మొదటి జైలుగా విశాఖ కేంద్ర కారాగారం నిలుస్తుందన్నారు. ఇది ఇక్కడ ఎనీ టైం క్లినిక్(ఏటీసీ) అని, అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

ఆర్వోలు, పోలీసులను ఆదేశించిన జిల్లా ఎన్నికల అధికారి

సాక్షి, విశాఖపట్నం: ఓట్ల లెక్కింపు ప్రకియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు కృషి చేయాలని కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డా.మల్లికార్జున రిటరి్నంగ్ అధికారులను, పోలీస్ అధికారులను కోరారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, చేపట్టవలసిన చర్యలు, భద్రతా ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తో కలిసి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డా.మల్లికార్జున నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులను పొందిన నాటి నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేవరకు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి విషయం కేంద్ర ఎన్నికల సంఘం మార్గనిర్దేశాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ఏసీపీని నియమించినట్లు చెప్పారు. పోలీస్ అధికారులు ముందుగానే వారి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించుకోవాలని సూచించారు. అన్ని నియోజక వర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయయనీ, ఆర్వోలు కూడా ధ్రువీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 4న కౌంటింగ్ దృష్ట్యా 3వ తేదీ అర్ధరాత్రి నుంచి 4వ తేదీ అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు మూసిఉంచాలని పోలీస్ కమిషనర్ ను కోరారు. పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ సిఎం. సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ‘నైట్ డ్యూటీ’ వివాదం

- రాత్రి విధుల నుంచి తప్పించుకునేందుకు నర్సుల అడ్డదారులు
- జూన్‌లోనూ ఇదే పరిస్థితి



దాబాగార్డెన్స్: ఇటీవల కాలంలో కేజీహెచ్ తరచూ వార్తల్లో నిలుస్తోంది. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడడంతో ఒకరి వెనుక మరొకరు గోతులు తవ్వుకుంటున్నారు. పైపైన మంచిగా కనబడుతున్నా.. లోలోన మాత్రం అక్కసు పెంచుకుంటున్నారు. తాజాగా నర్సుల నైట్ డ్యూటీ వ్యవహారం రచ్చకెక్కింది. ఇంత పెద్ద వివాదం నెలకొన్నా.. ఎక్కడి దొంగలు అక్కడే గప్ చుప్ అన్నట్టుగా ఏళ్ల తరబడి నైట్ డ్యూటీలకు డుమ్మా కొట్టిన వారిపై కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

కేజీహెచ్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న నర్సులు నైట్ డ్యూటీ తప్పించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నర్సు అనే వ్యక్తి ఉద్యోగరీత్యా నైట్ డ్యూటీలు చేయాల్సిందే. కానీ ఆరోగ్యం సహకరించడం లేదని.. దివ్యాంగురాలినని.. గుండె సమస్య ఉందని.. క్యాన్సర్‌తో బాధపడుతున్నానని.. ఇలా ఏవేవో సాకులు చూపుతూ.. వైద్యుల నుంచి అడ్డదారిలో సర్టిఫికెట్లు పొంది నైట్ డ్యూటీలు లేకుండా తప్పించుకుంటున్నారు. అందులోనూ నర్సింగ్ సూపరింటెండెంట్‌కు ఎంతో కొంత చేతులు తడిపితే నైట్ డ్యూటీలు వేయకుండా కాపాడుకుంటూ వస్తున్న సంప్రదాయం కొనసాగుతోంది. అందుకు నిదర్శనం ఇటీవల కేజీహెచ్‌లో జరిగిన పరిణామమే.

వివాదం ఇక్కడే మొదలు

కేజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఇటీవల డీఎంఈకి సరెండర్ చేయించిన సంగతి తెలిసిందే. ఆమె పలువురు నర్సుల వద్ద డబ్బులు తీసుకుని నైట్ డ్యూటీలు వేయలేదని మరికొందరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆమెను డీఎంఈకి సరెండర్ చేయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆమె తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

జూన్‌లోనూ ఇదే తంతు

కేజీహెచ్‌లో నర్సుల నైట్ డ్యూటీల వివాదం డీఎంఈ దృష్టికి వెళ్లినా.. జూన్‌కు సంబంధించి ప్రకటించిన రోస్టర్‌లో ఈ విషయంలో చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మొత్తం 58 మందితో రెడీ టూ లిస్ట్ తయారు చేశారు. రెడీ టూ లిస్ట్ అంటే నైట్ డ్యూటీ చేయాలి. లేకపోతే ఈవెనింగ్ విధులకు హాజరు కావాలి. కానీ జూన్‌కు సంబంధించి రెడీ టూ లిస్ట్‌లో సగం మందికి పైగా నైట్ డ్యూటీలు వేయలేదు.

హెడ్‌నర్స్ పదోన్నతిలో ఉన్న వారికి నైట్‌డ్యూటీ ఉండదా?

హెడ్‌నర్స్ పదోన్నతిలో కేఎం ఈశ్వరిబాయి, ఎంఈలక్ష్మి, నూకరత్నం, ఎం.విజయలక్ష్మి, జి.అమ్మాజీ, వై.భానుమతి, చిట్టమ్మ, సుజాతాదేవి, పి.సరోజ, టి.రమణమ్మ, ఈవీ రమణమ్మ, డి.సునీత తదితరులు ఉన్నారు. క్యాన్సర్ వచ్చి కీమో థెరపీ, రేడియోగ్రఫీ తీసుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా ఉండి.. పదోన్నతి కోసం నైట్‌డ్యూటీ రాకుండా పలువురు తప్పించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. వీరిలో టి.రమణమ్మ, ఎస్‌వై సత్యవతి, నీలవేణి, రమణమ్మ తదితరులు ఉన్నట్లు సమాచారం. హార్ట్ పేషెంట్ పేరిట కేఎం ఈశ్వరిబాయి, అనారోగ్యం కారణంగా వై.భానుమతి నైట్ డ్యూటీ నుంచి తప్పించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. వీరిందరినీ మూడు నెలలకోసారి డ్యూటీలు మార్పు చేయాలి. అయితే ప్రస్తుతం ఎక్కడ వారిని అక్కడే ఉంచారు. తాజాగా వచ్చిన నర్సింగ్ సూపరింటెండెంట్ కూడా వీరెవర్నీ మార్పు చేయలేదు. మొత్తం 58 మందిలో ఆరుగురికి మాత్రమే నైట్, ఈవెనింగ్ షిఫ్ట్‌కి మార్చినట్టు 'సాక్షి' దృష్టికి వచ్చింది.

శ్రీ ఆంజనేయం శిరసా నమామి..



ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనకాపల్లి రింగ్ రోడ్డు ఆంజనేయ ఆలయంలో జీడిపప్పు, బాదంపప్పుతో అలంకరణ ఇది.

ముగిసిన ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ శేషు



శిక్షణ పొందిన స్వయం సేవక్‌ల ప్రదర్శనలు

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార ఆవరణలో శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ శిక్షావర్గ, ఘోష్‌వర్గ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా భీమిలి యోగా చైతన్య సంస్థ కార్యదర్శి సిహెచ్ వెంకటరమణ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ శేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు శిక్షణ పొందిన స్వయం సేవక్‌లనుద్దేశించి మాట్లాడారు. దేశ నిర్మాణానికి చిత్తశుద్ధి గల బలమైన యువకుల అవసరం ఎంతైనా ఉందన్నారు. రానున్న కాలంలో ప్రపంచ దేశాలకు మన దేశం మరిన్ని రంగాల్లో మార్గదర్శకం కానుందన్నారు. ఇందుకు అంతా సిద్ధం కావాలన్నారు.

ఈ సందర్భంగా శిక్షకుల ప్రదర్శనలు ఆహూతులను ఆకర్షించాయి. అనంతరం దేశభక్తి గీతాలను ఆలపించారు.



విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,550
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,500
వెండి(కిలో):	రూ.98,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

మురళీనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. గైస్‌లో 75,001-83,500, పాలిటెక్నిక్‌లో 83,501-92,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 75,001-92,000 ర్యాంకుల విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. గైస్‌లో 174 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 206 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 72 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆదివారం గైస్‌లో 92,001-1,00,000, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1,00,001-1,08,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 92,001-1,08,000 ర్యాంకుల విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. ఎస్టీ విద్యార్థులకు కంచరపాలెం పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

తెన్నేటి పార్కు వద్ద కారు పార్కింగ్ సౌకర్యం



కొండ దిగువున పార్కింగ్ చేసిన కార్లు

ఆరిలోవ: తెన్నేటి పార్కు ఎదురుగా కార్ పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ కైలాసగిరి కొండ దిగువున విశాలమైన ఖాళీ స్థలం ఉంది. కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని అనుకుని ఉన్న కొండ భాగం కొంత తవ్వేసి అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేయించారు. వీఎంఆర్డీఏలో కొందరు అధికారులతో కలసి వాటిని వ్యాపారులకు అప్పగించి.. నెలనెలా డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకునేవారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ మల్లికార్జునకు సందర్శకులు, స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో వీఎంఆర్డీఏ అధికారులు అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని.. కార్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పార్కింగ్ చేసిన కారుకు రూ.10 చొప్పున టికెట్ వసూలు చేస్తున్నారు. కాగా.. పార్కింగ్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. గతంలో ఈ పార్కుకు వచ్చే సందర్శకులు పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడా సమస్య తీరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

8న మెగా జాబ్‌మేళా

సీతంపేట: అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్, విశాఖ ముస్లిమ్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా ఈ నెల 8వ తేదీన అక్కయ్యపాలెం అబిద్‌నగర్ హైవేరోడ్‌లో గల షాదీఖానా కల్యాణ మండపంలో మెగా జామ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రహమతుల్లాబేగ్ తెలిపారు. ఆరోజు 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి, 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. హాజరు కాదలచిన వారు 5 రెజ్యూమ్, 5 పాసుపోర్టు ఫొటోలు తీసుకురావాలన్నారు. www.tinyurl.com/AMPjobDrive 2024 వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 98481 95722 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.